చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహద పడతాయని బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మని వరప్రసాద్ – నాగమణి దంపతులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఉచితంగా రామకోటి పుస్తకాలు పంపిణీ



జగద్గిరిగుట్ట: మగ్దుంనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బచ్చు మౌనిక ఆంజనేయులు సహకారంతో రామకోటి పుస్తకాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువజన నాయకులు కొలుకుల జైహింద్, ఎస్‌వి శంకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు శివకుమార్ గన్నారం, సతీష్ షిండే, ఆంజనేయులు గుప్తా, వీరేష్, శ్రీ సాయిలు, యశ్వంత్, కూర రాజు పాల్గొన్నారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: స్కూల్, క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ సభ్యుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి యూనియన్ సభ్యులతో పాటు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉండే మురళి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను మృతి చెందడంతో డ్రైవర్స్ యూనియన్ స్వామి కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కార్పొరేటర్ డ్రైవర్ మురళి భార్య మాలతీకి రూ. 10 వేలు, డ్రైవర్స్ యూనియన్ సభ్యులు రూ. 16 వేలు కలిపి రూ. 26 వేలను బీఆర్ఎస్ నాయకుడు మల్లేష్‌యాదవ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో డ్రైవర్స్ యూనియన్ నాయకులు రాజేష్, నాగరాజు, ప్రశాంత్, రాజేష్, నవీన్, రితీష్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులివ్వండి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఒకటో వార్డు నేతాజీ నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు కేటాయించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జేఎమ్మార్), ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఆదివారం కంటోన్మెంట్‌లో పర్యటించిన ఎంపీ ఈటలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో ఉండే నేతాజీ నగర్లో కమ్యూనిటీ హాలు నిర్మిస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఈ స్థలంలో గతంలో స్కూలు ఉండేదని, కొన్నేళ్లుగా ఈ స్థలం పూర్తిగా నిరుపయోగంగా మారిందన్నారు.



దుండిగల్‌లో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



స్వామి వారికి పూజలు చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి



జయరామ్‌నగర్ రామాలయం వద్ద పానకం అందజేస్తున్న ఆలయ కమిటీ

కమనీయం.. సీతారాముల కల్యాణం

- వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- కల్యాణంలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు
- జైశ్రీరామ్ నినాదంతో మారుమోగిన ఆలయాలు, వీధులు
- ఆలయాల వద్ద అన్నదానాలు

జై శ్రీరామ్.. సీతారామ్.. అంటూ భక్తుల నామస్మరణలతో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. కల్యాణాన్ని వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో ఆలయాలు కిక్కిరిసి పోయాయి. కల్యాణోత్సవంలో జీలకర్ర బెల్లం, మంగళసూత్రధారణ, అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ వంటి కార్యక్రమాలు కన్నుల పండవగా జరిగాయి. కల్యాణానికి వచ్చిన భక్తులకు వడపప్పు, పానకాన్ని ప్రసాదంగా అందజేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానాలు చేశారు.

– కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..



గాజులరామారంలో సీతారాముల ఊరేగింపులో భక్తులు



చింతల్ హెచ్ఎంటీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ..



నిజాంపేట్‌లో కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



భౌరంపేట్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో..



చింతల్ శ్రీసాయినగర్ కాలనీలో ఉత్సవ మూర్తులు



నిజాంపేట్‌లో స్వామివారి కల్యాణం



సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో..



జగద్గిరిగుట్ట మగ్దూమ్‌నగర్‌లో..



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో జరిగిన కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మహనీయుల జయంతులను ఘనంగా నిర్వహించాలి

జగద్గిరిగుట్ట: మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, బాబాసాహెబ్ అంబేడ్కర్‌ల జయంతి కార్యక్రమాలను ఏప్రిల్ 11, 14 తేదీల్లో జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఘనంగా నిర్వహించాలని పలువురు నేతలు కోరారు. కేవలం విగ్రహాలకు దండలు మాత్రమే కాకుండా ప్రజలకు మహనీయుల చరిత్రను తెలియజేసేటట్లు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలన్నారు. డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్ ఈ సేవా కేంద్రం వద్ద బీసీ హక్కుల సాధన సమితి, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి నాయకులు ప్రవీణ్, కృష్ణ, సదానంద్, ఉమా మహేష్, శ్రీనివాస్, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటేష్, బాబు, జంబు, హరినాథ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం

దుండిగల్: భౌరంపేట ప్రభుత్వ పాఠశాలలో చదివే తాను ఈ స్థాయికి వచ్చానని బీజేపీ జిల్లా కన్వీనర్, పాఠశాల పూర్వ విద్యార్థి ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేటలోని ప్రభుత్వ పాఠశాల వార్షిక వేడుకలను శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. బౌరంపేట సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత ఈ పాఠశాలను 10వ తరగతికి అప్‌గ్రేడ్ చేయించానన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంరెడ్డి, నాయకులు జంగారెడ్డి, పీసరి కష్టారెడ్డి, గోనె మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్.మల్లారెడ్డి

అక్రమ మద్యం స్వాధీనం

కుత్బుల్లాపూర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రెండు చోట్ల పోలీసులు దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐలు మహేశ్వర్ రెడ్డి, లావణ్య ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లిలో ఓ కిరాణా షాపు వద్ద మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గుర్తించి అతని నుంచి 16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. అదేవిధంగా సుభాష్ నగర్ సీఎంఆర్ స్కూల్ సమీపంలో అక్రమంగా మద్యంతో పాటు కల్లు అమ్ముతున్న వ్యక్తిని గుర్తించి 30 లీటర్ల కల్లు, 1.8 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

డీసీఎం ఢీ కొట్టడంతో వలస కూలీ మృతి

కుత్బుల్లాపూర్: డీసీఎం ఢీకొట్టిన ఘటనలో ఓ కూలీ మృతి చెందిన ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర నాందేడ్ మండలం, కినాలా గ్రామానికి చెందిన షేక్ ఆయూబ్(35) గుండ్లపోచంపల్లిలో ఉంటూ కూలీగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో పనులు ముగించుకుని తన స్నేహితులైన రోహన్‌గుప్తా, రవి గుప్తా, శివకాంత్‌లతో కలిసి ఇంటికి వెళ్తుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఆయూబ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అదే రోజు రాత్రి 12 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మిగతా ముగ్గురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటీ రణదీవే స్ఫూర్తితో కార్మికులు ఉద్యమించాలి



బీటీ రణదీవే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం బీటీ రణదీవే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీటీ రణదీవే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, అదే విధంగా జీవితాంతం కార్మిక, కష్టజీవుల హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ దేశంలో కార్మిక సంఘాలకు కేంద్ర బిందువుగా ఉన్న సీఐటీయూని స్థాపించడంలో రణదీవే ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఆయన స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కార్మిక లోకం పోరాటాల్లో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరుణాకర్, శీను, మధు, మల్లారెడ్డి, యాదవరెడ్డి, వీరేష్, దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు

జెండా ఆవిష్కరించిన నేతలు

కుత్బుల్లాపూర్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. కొంపల్లిలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సాగర్ ఆధ్వర్యంలో జెండా వందనం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, నాయకులు చక్రదర్, నర్సింగ్, దుర్గా అశోక్, మధు, మహేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్, శంకర్ నాయక్, గోపాల్ రెడ్డి, మాధురి, మహేందర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ డివిజన్‌లో..

డివిజన్ అధ్యక్షుడు కట్ట కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి హాజరై మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే ప్రతి వ్యక్తిని బీజేపీ గుర్తిస్తుందని, కష్టపడి పని చేస్తే పదవులు వాటి అంతట అవే వస్తాయని గుర్తు చేశారు. వచ్చే గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ కార్యక్రమాలను వేగవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.



గండిమైసమ్మలో జెండాను ఆవిష్కరించిన మల్లేష్ యాదవ్



కొంపల్లిలో ..

గండిమైసమ్మ చౌరస్తాలో..

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలోని పార్టీ కార్యాలయం వద్ద మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఏ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీశైలం యాదవ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ విజయసాయి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీడిమెట్ల బస్ డిపో వద్ద

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్‌లో అధ్యక్షుడు శ్యాంపూర్ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు ఎం.ఎస్.వాసులు ముఖ్య అతిథులుగా హాజరై జీడిమెట్ల బస్ డిపో వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు రాజు, కంటెస్టెడ్ కార్పొరేటర్ కళ్యాణి శ్రీనివాస్, నాయకులు విఘ్నేష్, సురేష్, రవి, మోహన్, కిరణ్, భారతీ రెడ్డి, శిరీష, వనమాల రెడ్డి పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ డివిజన్‌లో గిరివర్ధన్‌రెడ్డి



జీడిమెట్ల బస్ డిపో వద్ద పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

ఆస్తి పన్ను కట్టండహో..!

- ఈ నెల 30లోగా చెల్లించిన వారికి 5 శాతం డిస్కౌంట్
- శివారు పురపాలక సంఘాల్లో అవగాహనకు అధికారుల చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాలిటీల్లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీని పురపాలక శాఖ ప్రకటించింది. జిల్లాలో నిజాంపేట, బోడుప్పల్, పీర్జాదిగూడ, పీర్జాదిగూడ, జవహర్‌నగర్ నగర పాలక సంస్థలతో పాటు మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి బకాయిలు లేని వారు ఈనెల 30లోగా పన్ను చెల్లిస్తేనే ఈ రాయితీ వర్తించనున్నది. పురపాలికల్లో ఈసారి బకాయిలు భారీగా వసూలు కావడంతో పెద్ద సంఖ్యలో ఇంటి యజమానులు రాయితీకి అర్హత పొందారు.

గత ఆర్థిక సంవత్సరంలో ..

గత ఆర్థిక సంవత్సరం (2024–25) మార్చి 31న ముగిసింది. వారం ముందు 90 శాతం వడ్డీ రాయితీ ఇవ్వడంతో బకాయిదారులు పన్ను చెల్లించేందుకు ముందుకొచ్చారు. పుర సిబ్బంది, ఉద్యోగులు పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పన్నులు వసూళ్లు అయ్యాయి. జిల్లాలో నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో రూ.198.45 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, చివరి రోజు వరకు రూ.163.08 కోట్లు మాత్రమే వసూలు చేశారు.



5 శాతం రాయితీ

ఆస్తి పన్ను క్రమం తప్పకుండా చెల్లించే వారికి ఈ 5 శాతం రాయితీ ఎంతో ఊరటనిస్తోంది. ఈనెల1 నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. దీనికి సంబంధించిన ఆస్తిపన్ను మదింపు డిమాండ్ ఇంటి నంబర్లు వెబ్‌సైట్‌లో వచ్చేస్తోంది. అలాగే, మెయిల్, వాట్సాప్ మేసేజ్‌ల ద్వారా కూడా ఆస్తి పన్ను వివరాలను ఆయా పురపాలక సంఘాలు ఇంటి యజమానులకు పంపిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి అంటే.. మార్చి 2026 వరకు పన్ను మొత్తం చెల్లిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. బకాయిలు ఉన్నాయని పురపాలక శాఖ అధికారులు కూడా బలవంతం చేయరు. పురపాలక సంఘాల పరిధిలో ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఒక్కసారి పన్ను చెల్లిస్తే వచ్చే ఏడాది వరకు పన్ను చెల్లించాలనే ఆందోళన కూడా ఉండదు. ఆ తర్వాత చెల్లించే వారికి మాత్రం పన్ను మొత్తంలో ప్రతి నెలా 2 శాతం వడ్డీ భారం పడనున్నది.